## మినీ కథ

# కృతజ్ఞత కథ

డాక్టర్. బుచ్చిరెడ్డి, కేతు




మధ్యాహ్నం భోజనానికి కూర్చున్నా. ఆస్పత్రి మంచి రావటము ఆలస్యమవుతుంది కాబట్టి, నా కోసము అన్నీ డైనింగ్ టేబుల్‌పై సర్ది సిద్దంగా ఉన్నాయి. టేబుల్‌పై బోర్లించిన స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లేటు తీయబోయాను. ప్లేటు వెనకాల "ప్రెజెంటెడ్ బై— రామకృష్ణ" అని ఉంది. ప్లేటు వెనకాల ఓ కథ వుంది. అది చెప్తేచాలదు. రామకృష్ణను గురించి ఇంకా కొంచెము ఎక్కువ చెప్ప వలసి వస్తుంది.

రెండేళ్ళ క్రిందట కళ్యాణదుర్గము ఆస్పత్రిలో పనిచేస్తున్నప్పుడు, చదువుకొన్నవాడు, యువకుడైన రామకృష్ణకు నేను పరిచయమయ్యాను. అపుడపుడు ఆస్పత్రికి వస్తూ— తనకోసము, తనవారి కోసము. కొంత కాలానికి పరిచయము సన్నిహితానికి దారితీసింది. ఇద్దరి అభిరుచులూ కొన్ని ఒకటేకావడము ఆత్మీయులుగా మారడానికి అవకాశము కలిగింది.

ఒకసారి రామకృష్ణ ముఖము మీది గంతి సంగతి ఎత్తాను. "సామ డాక్టర్! ఎన్నో రోజులనుంచీ అడగాలను కొంటున్నాను, మీరే ఎత్తారు. ఈ మధ్య ఇది పెరిగి పెద్దదవుతోంది, పైగా నొప్పికూడా వస్తూంది" అన్నాడు. "మీకిష్టమైతే ఆపరేషన్ చేస్తాను" అన్నాను.

"ఈ గంతితో వికారంగా వున్న ముఖం అందంగా చేస్తా నంటే ఎవరువద్దంటారు?" అంటూ సమ్మతి తెలిపాడు.

గంతి ఆపరేషన్ చేసి, తీసివేసిన తరువాత చిన్న మచ్చతో కొత్త ముఖము, కొత్త మనిషిలా ఉన్నాడు, రామకృష్ణ.

"ఊర్లో అందరూ మెచ్చుకుంటున్నారు మిమ్మల్ని. ఆపరేషన్ చేసి నాకు అందం ప్రసాదించారు" అంటూ టేబుల్‌పైన పలచటి కాగితంతో కట్టిన పాకెట్ ఒకటి పెట్టాడు, రామకృష్ణ ఒక రోజువచ్చి.

"ఎందుకిదంతా, వద్దు" అన్నాను.

"డాక్టరు గారూ, బిల్లు చెల్లిస్తే ఒప్పకోరుగా" అన్నాడు.

"అంటే, బిల్లు ఈ విధంగా వస్తురూపేణా చెల్లిస్తున్నావనమాట, క్యాష్ ఆర్ కైండ్, ఏదైనా ఒకటే గదా" అన్నాను నవ్వుతూ.

"ఏదో జ్ఞాపకార్థం. కృతజ్ఞతకు గుర్తు" అన్నాడు రామకృష్ణ.

"భలేవాడివే" అన్నాను రామకృష్ణ భుజం తడుతూ.

ఉద్యోగం పురుష లక్షణం. ట్రాన్స్‌ఫర్ ఉద్యోగ లక్షణం. గాలి పీల్చటం, నీళ్ళు త్రాగటం, ఎంత సహజమో ఉద్యోగికి ట్రాన్స్‌ఫర్ అంత సహజం. బదిలీ మీద అనంతపురం రావడం జరిగింది. నేను అనంతపురం వచ్చిన కొత్తలో రామకృష్ణ ఒకసారి వచ్చాడు. తరువాత అంత ఎక్కువగా రాలేదు.

రామకృష్ణ హడావిడిగా ఒకసారి రాత్రి పదింటికి మా ఇంటికి వచ్చాడు— ముఖము దిగాలుగా పెట్టుకొని. తిరుపతిపోయి తిరిగి వస్తున్నట్లు, మధ్యలో పరుసు ఎవరో కొట్టేశారు. కళ్యాణదుర్గము పోవటానికి, తన వెంట వచ్చిన కుటుంబ సభ్యులందరికీ ఆ రాత్రి భోజనాలకీ వగైరా ఖర్చులకీ వంద రూపాయలు కావాలన్నాడు. ఊరు చేరినవెంటనే పంపుతానన్నాడు. వాళ్ళం దరినీ బస్టాండులో కూర్చోబెట్టివచ్చానన్నాడు. ఇంటికి పిలుచుకొనిరమ్మన్నాను, భోంచేయవచ్చని. వద్దన్నాడు.

గుండూ లేదూ, ప్రసాదము లేదు, బస్‌స్టాండులో వాళ్లను పిలుచుకు రమ్మంటే వద్దంటున్నాడు. పైగా మాటలలో తడబాటు. నా మనసులో ఏ మూలో కొంత అనుమానమున్నా, ఆప్యాయత అడ్డువచ్చి రామకృష్ణ అడిగి నట్టే వంద రూపాయలిచ్చి పంపాను.

తరువాత రామకృష్ణ రాలేదు, డబ్బు తిరిగి రాలేదు. డబ్బు దగ్గరితనాన్ని దూరము చేస్తుందంటారు. సంవత్సరము గడిచింది. వంద రూపాయలకు రామకృష్ణ ఎందుకిలా చేస్తాడు. తనిచ్చిన ప్రజెంటేషన్ వడ్డీతో సహా ఈవిధంగా రాబట్టుకున్నాడా? ఛీ! అలా ఎప్పటికీ చేయడు. చిల్లర వ్యవహారము మనిషి కాడు. కాలము గడచిపోతోంది. వంద రూపాయలకు నీళ్ళు వదలుకున్నా.

"పోస్టు" అన్న కేకతో ఉలిక్కిపడి ఈ లోకంలో పడ్డా. యాంత్రికంగా అడుగులు వేశా. తలుపు దగ్గర ఓ ఉత్తరము పడింది. తలుపు తీశాను.

"మని ఆర్డరు సార్!" అన్నాడు పోస్టుమాన్. చూశాను రామకృష్ణ దగ్గరనుంచే. ఆశ్చర్యపోయాను. సంతకము చేసి వంద రూపాయలు తీసుకొన్నాను.

ఉత్తరము తెరిచి చదివాను. "డాక్టరు గారికి నమస్తే! ఆదివము రాత్రి మీ ఇంటికి వచ్చా; తిరుపతి ప్రయాణము, పరుసుపోవడము—కల్పించి అబద్దము చెప్పి మీ దగ్గర డబ్బు తీసుకొన్నా. మట్కాలో డబ్బు పోగొట్టుకొని మట్కాకు బానిసయి అలా అబద్దము చెప్పాను. ఆశల అశ్వాల తోకలు పట్టుకొని, నంబర్లను నమ్ముకొని పరిగెత్తి పరిగెత్తి అలసిపోయాను. మీకు నేనిచ్చిన ప్రజెంటేషన్‌కు మీరిచ్చిన డబ్బుకూ చెల్లు అని కొన్నాళ్ళు, మనసులో సమ్మపెట్టుకొని — ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంత కాలము — మీ డబ్బు తిరిగి ఇవ్వలేకపోయాను. అద్దములో నా ముఖము చూసుకొన్నప్పుడల్లా మీ ముఖమే కనిపిస్తుంది! మీరు తీర్చి దిద్దిన ముఖం, మీరు ఆపరేషన్ చేసిన సన్నని గాయపు మచ్చ.... ఎప్పుడూ గుర్తు వస్తుంది. నేను చేసినపని కనిపించని గాయములా మనసుని కెలికివేస్తోంది. భరించలేకున్నాను. అందుకే, పొలములో కష్టపడి పనిచేసి పోగేసిన డబ్బు మీకు తిరిగి ఇస్తున్నా. మీ మంచి మనసు నన్ను మన్నించాలని మరీ మరీ కోరుతున్నా. కృతజ్ఞతలతో — మీ రామకృష్ణ".

ఉత్తరం చదవడము పూర్తి చేసిన నా కళ్ళు చెమ్మగిల్లాయి. తప్పుచేసి ఒప్పుకోవడమూ ఒక గొప్పే! డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళి రామకృష్ణ ప్రెజెంట్ చేసిన స్టీల్ ప్లేటులో వడ్డించుకొని తృప్తిగా భోంచేశాను.

